సాక్షి
చిత్తూరు
ఆదివారం । 27 । ఆగస్టు । 2023



ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు మంత్రులు, అధికారులు తెలిపారు. - 8లో



యునిసెఫ్ ఫినాలేకు విద్యార్థినులు

యునిసెఫ్ మెగా ఫినాలేకు తడుకు విద్యార్థినులు రూపొందించిన పరికరం ప్రదర్శనకు ఎంపికైంది. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	34	25
తిరుపతి	34	26
తిరుమల	29	22
గూడూరు	35	28
నగరి	34	26

న్యూస్‌రీల్

అంతర్జాతీయ ఇన్‌స్పైర్‌కు ఇద్దరు విద్యార్థులు



ప్రణయ



చరణ్‌తేజ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి జిల్లా నుంచి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అంతర్జాతీయ ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఎంపికయ్యారు. శనివారం ఈ మేరకు విద్యాశాఖ అధికారులు మాట్లాడుతూ గుడిపాల మండలం ఏఎల్‌పురం జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి కె.ప్రణయ, పీలేరు మండలం జగంపల్లె జెడ్పీ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి పడిగల చరణ్‌తేజ్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థులు నవంబర్ 13 న జపాన్‌లో నిర్వహించే సకుర సైన్స్ హైస్కూల్ ప్రోగ్రామ్‌కు హాజరుకానున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ షణ్మోహన్ ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులకు పాస్‌పోర్టులను మంజూరు చేయించినట్లు వివరించారు. విద్యార్థులను డీఈఓ విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, డీవైఈఓ చంద్రశేఖర్, సైన్స్ అధికారి వెంకటరమణ అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ విజయేంద్రరావు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 5వ తేదీన జిల్లా స్థాయిలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ మేరకు ఈ నెల 31వ తేదీలోపు దర ఖాస్తు ప్రతిపాదనలను పంపాలని వెల్లడించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మోహన్‌రెడ్డి, వెంకటేశు

కాణిపాకం(యాదమరి): వినాయక స్వామి ఆలయంలో చవితి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు మాట్లాడుతూ సెప్టెంబర్ 2వ తేదీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

సూక్ష్మం.. సాయం!

అన్నదాతలను ఆధునిక వ్యవసాయం దిశగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకుని సులభతరంగా సాగు చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. ప్రధానంగా ఉద్యానరంగంలో సూక్ష్మ సేద్యానికి పూర్తి సహకారం అందిస్తోంది. క్షేత్రస్థాయిలో మైక్రో ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తోంది. తక్కువ నీటితో అధిక దిగుబడి పొందేలా దిశానిర్దేశం చేస్తోంది. అందులో భాగంగా సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందజేస్తోంది. ఈక్రమంలోనే భూగర్భజలాలను సైతం పొదుపు చేయిస్తోంది.

- ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- బిందు సేద్యంపై అవగాహన కల్పిస్తున్న అధికార యంత్రాంగం
- అన్నదాతలకు రాయితీపై డ్రిప్ పరికరాల పంపిణీ
- ఆధునిక విధానాలపై మొగ్గు చూపుతున్న రైతాంగం



డ్రిప్ పరికరాలు పంపిణీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రులు ఉషశ్రీచరణ్ , పెద్దిరెడ్డి (ఫైల్)

సాక్షి, చిత్తూరు : జిల్లాలోని రైతుల్లో 70శాతం మంది ఉద్యాన రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో సూక్ష్మ సేద్యం వైపు ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. నీటి పొదుపు, అధిక దిగుబడి, ఆదాయం పొందేందుకు ఆధునిక విధానాలపై ఆసక్తి చూపుతున్నారు. నీటి కష్టాలకు చెక్ పెట్టేలా డ్రిప్ పరికరాలతో సాగు చేస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్లు, మల్చింగ్ షీట్ తదితరాలను ఉపయోగించి సేద్యం చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా సాగవుతున్న ఉద్యానవన పంటల్లో డ్రిప్ పరికరాలను వినియోగిస్తూ ఆశాజనకంగా ఆదాయం ఆర్జిస్తున్నారు. రైతులు తమకు నచ్చిన కంపెనీ డ్రిప్ సామగ్రి పొందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించిన వెసులుబాటు సద్వినియోగం చేసుకుంటున్నారు.

లక్ష హెక్టార్లకు పైగా..

రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనంతగా చిత్తూరు జిల్లాలో మాత్రమే ఈ ఉద్యాన పంటల విస్తీర్ణం ఎక్కువగా ఉంది. సుమారు లక్ష హెక్టార్లకు పైగా ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. ప్రధానంగా మామిడి, టమాట, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బీన్స్, వంగ, బెండ, ద్రాక్ష పండిస్తున్నారు. అన్నిరకాల పుష్పాలను సైతం పండిస్తున్నారు. వీటితో అత్యధికంగా మామిడి మాత్రమే సుమారు 60 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. అందులో డ్రిప్, స్ప్రింక్లర్లు, మల్చింగ్ షీట్ వంటి ఆధునిక పద్ధతులను వినియోగిస్తున్నారు.

రైతుల ఎంపిక మేరకే..

రైతులకు తమకు ఇష్టం వచ్చిన డ్రిప్ కంపెనీలు ఎంపిక చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు ఎక్కువ కంపెనీలను రాష్ట్రానికి రప్పించింది. అలాగే కంపెనీల ఆధిపత్యం లేకుండా ప్రభుత్వమే విధి విధానాలను నిర్దేశిస్తోంది. సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, ఆంధ్రప్రదేశ్ సమీకృత నీటిపారుదల, వ్యవసాయ పరివర్తన పథకం, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల జీవనోపాదుల అభివృద్ధి ద్వారా ఉద్యాన పంటలకు ప్రోత్సాహం అందిస్తోంది.

90 శాతం సబ్సిడీ..

ఐదు ఎకరాల్లోపు సన్న, చిన్న కారు రైతులకు 90 శాతంతో రాయితీతో డ్రిప్ పరికరాలను పంపిణీ చేస్తోంది. ఒక్కో రైతుకు రూ.2.18 లక్షలు సబ్సిడీ లబ్ధి చేకూరుతోంది. 5 నుంచి 10 ఎకరాల రైతులకు 70శాతంతో ఒక్కో రైతులకు రూ.3.46లక్షల రాయితీ కింద బిందు సామగ్రిని అందజేస్తున్నారు.

జిల్లా సమాచారం (కోవిడ్ కాలం మినహాయించి)

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	అందించిన పరికరాలు	సబ్సిడీ మొత్తం	సాగులోకి వచ్చిన హెక్టార్లు
2019–20	12,108	రూ.103కోట్లు	రూ.87.68 కోట్లు	12,126
2022–23	6,512	రూ.61.80 కోట్లు	రూ.51.37 కోట్లు	5,719



డ్రిప్ పరికరాలు లారీల్లో తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

7 వేల హెక్టార్లకు పరికరాలు

జిల్లాలో ప్రధానంగా, మామిడి, కూరగాయల పంటలు, సెరికల్చర్ సాగుకు డ్రిప్ పరికరాలను విరివిగా వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో గత ఏడాది జిల్లాలో 5వేల హెక్టార్లకు డ్రిప్ పరికరాలు అందించాలని లక్ష్యం పెట్టుకున్నారు. అయితే మొత్తం 6,681 హెక్టార్లకుగాను 7,669 మంది రైతులకు డ్రిప్ పరికరాలను పంపిణీ చేశారు. ఈ ఏడాది 7వేల హెక్టార్లలో డ్రిప్, ఇతర పరికరాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే, ఇప్పటికే 15వేల హెక్టార్ల కోసం మొత్తం 13,488 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పర్యాయం కూడా లక్ష్యాన్ని అధిగమించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు.

పారదర్శకంగా పరిశీలన

రైతు భరోసా కేంద్రాల్లో డ్రిప్ పరికరాల కోసం వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలిస్తున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి వివరాలు నమోదు చేస్తున్నారు. పైప్ లైన్ వేసే విధానం, బోర్‌వెల్, రైతు సమాచారాన్ని సమగ్రంగా సేకరిస్తున్నారు. ఈ క్రమంలో రైతు ఎంపిక చేసుకున్న కంపెనీ వారు అందించిన అంచనాల మేరకు పరికరాలకు సబ్సిడీని వర్తింపజేస్తున్నారు. అయితే రైతులు నాన్ సబ్సిడీ మొత్తాన్ని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్‌కు చెల్లించాల్సి ఉంటుంది.

15 రోజుల్లో పరికరాలు

జిల్లాలో మొత్తం 16 కంపెనీలకుపైగా డ్రిప్, అనుబంధ పరికరాలు అందిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న రైతుల పంట పొలాలను కంపెనీ ప్రతినిధితో పాటు హార్టికల్చర్ అసిస్టెంట్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేస్తారు. అనంతరం రూపొందించిన అంచనాల ప్రకారం సబ్సిడీ పోను మిగతా సొమ్మును సదరు రైతు చెల్లించిన 15 రోజుల్లోపు డ్రిప్ పరికరాలు అమర్చుతారు.

డిమాండ్‌కు తగ్గట్టు..



జిల్లాలో పెద్ద రిజర్వాయర్లు, శాశ్వత సాగునీటి ప్రాజెక్టులు లేవు. ఎక్కువగా వర్షాధారం మీద, బోర్లను నమ్ముకుని వ్యవసాయం చేస్తున్నారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు తక్కువ ఎరువుల వినియోగం కారణంగా ఎక్కువ మంది రైతులు డ్రిప్ విధానంపై మొగ్గు చూపుతున్నారు. ఉత్పత్తులలో నాణ్యత కూడా బాగా ఉన్నందున ఎక్కువ మంది డ్రిప్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఈక్రమంలోనే డిమాండ్ తగ్గట్టు రైతులకు అవసరమైన పరికరాలు అందిస్తున్నాం. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మరింత మందికి లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టాం.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి

సాగు సులువు



ఉద్యాన పంటల ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని అధికారుల ద్వారా తెలుసుకున్నా. వృథా ఖర్చులు అరికట్టేందుకు ఆదాయం పొందేందుకు డ్రిప్ విధానం బాగుంటుందని మాకు అవగాహన కల్పించారు. రాయితీపై అందించే పరికరాల కోసం ఆర్‌బీకేలో దరఖాస్తు చేసుకున్నా. నాన్ సబ్సిడీ మొత్తం నగదు చెల్లించా. 15 రోజులకు డ్రిప్ పైపులను కంపెనీ వారు మా పొలంలో డ్రిప్ అమర్చారు. దీంతో సాగు సులువుగా సాగుతోంది.

– వెంకటేష్, రైతు, రెడ్లపల్లె, గంగాధర నెల్లూరు మండలం

జగనన్నకు కృతజ్ఞతలు



ఉద్యాన పంటలు సాగుకు నీరు, ఎరువులు, క్రిమిసంహారక మందులు ఉపయోగించాలంటే డ్రిప్ చాలా అవసరం. గత ఏడాది నేను సబ్సిడీపై డ్రిప్ పరికరాలు తీసుకున్నా. కూరగాయలు, పండ్లతోటలు సాగు చేస్తున్నా. ప్రభుత్వం సకాలంలో డ్రిప్ పరికరాలు మంజూరు చేయడంతో ఖర్చు చాలా తగ్గింది. మమ్మల్ని ఆదాయ బాటలో నడిపించిన ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

– రాకేష్ రెడ్డి, మోటుమల్లెల, రొంపిచర్ల మండలం

లక్ష్యాలను అధిగమించేలా..



ఉద్యాన పంటలకు డ్రిప్ ఇరిగేషన్ చాలా అవసరం. ప్రభుత్వం సబ్సిడీపై సంబంధిత పరికరాలను అందజేస్తోంది. ఆ మేరకు మాకు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా రైతులకు డ్రిప్ సామగ్రి పంపిణీ చేస్తున్నాం. దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ పరికరాలు సరఫరా చేసేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– రమణారెడ్డి, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్

తక్కువ ఖర్చుతో..



జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా బోర్ల కింద సాగవుతోంది. నీరు, ఎరువులు వృథా కాకుండా, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందేందుకు డ్రిప్ పరికరాల ఉపయోగపడుతున్నాయి. అందుకే రైతులు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. ఏపీఎంఐపీ ద్వారా సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందిస్తున్నాం. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

ముస్లిం ఏక్తా మంచ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మహ్మద్ అలీ



చిత్తూరు కలెక్టరేట్ : ముస్లిం ఏక్తా మంచ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మహ్మద్ అలీ, ఉపాధ్యక్షుడిగా గఫార్ ఖాన్‌ను నియమించినట్లు అసోషియేషన్ జాతీయ చీఫ్ జనరల్ సెక్రటరీ చౌహాన్ ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికైన సభ్యులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ముస్లిం ఏక్తా మంచ్ జాయింట్ యాక్షన్ కమిటీలో చోటు దక్కడం ఆనందంగా ఉందన్నారు. ముస్లింల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలిపారు.

అభివృద్ధే అజెండాగా అడుగులు

- ఇంటింటికీ గండికోట నీరు అందిస్తాం
- పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన
- సంక్షేమ ప్రభుత్వానికి ఓటేయండి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పెద్దగొట్టిగల్లులో సహకార శాఖ పెట్రోల్ బంక్ ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల : రాష్ట్రాభివృద్ధే అజెండాగా అడుగులు వేస్తున్న సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బొమ్మయ్యగారిపల్లె, పెద్దగొట్టిగల్లు పంచాయతీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రొంపిచెర్ల మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో రూ.50 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గదులు, పెద్దగొట్టిగల్లులో రూ.1.40 కోట్లతో నిర్మించిన హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు. అలాగే ఓ ప్రైవేట్ కల్యాణ మండపానికి సైతం ప్రారంభోత్సవం చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన వైఎస్సార్‌సీపీకి మళ్లీ ఓటేసి గెలిపించుకోవాల్సి బాధ్యత ప్రజలపై ఉందని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి ప్రతి ఇంటికీ నీటిని సరఫరా చేస్తామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించినట్లు వెల్లడించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పంపిణీ చేశారు. మోటుమల్లెలకు చెందిన పి.హితేష్ బాబుకు రూ.64 వేలు, రొంపిచెర్లకు చెందిన ఎన్.లలితకు రూ. 42వేలు, పెద్దమల్లెలకు ముత్యాలుకు రూ.15 వేలు చెక్కులను అందజేశారు. అలాగే బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ చల్లావారిపల్లెలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైన వెంకటేశ్వర వరప్రసాద్ కుటుంబానికి రూ.5 లక్షల బీమా నగదును మృతుడి భార్య మాధవి బ్యాంక్ ఖాతాలో జమ చేసి రశీదు అందించారు. ప్రమాదం జరిగిన నెలలోపే బాధిత కుటుంబానికి పరిహారం అందించామని మంత్రి తెలిపారు.

రైతులకు రాయితీపై పరికరాలు

వాటర్ షెడ్ పథకం కింద 245 మంది రైతులకు మంజూరైన వివిధ రకాల పరికరాలను మంత్రి పెద్దిరెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని లబ్ధిదారులకు రూ.62.35 లక్షల విలువైన వ్యవసాయ పనిముట్లు, పరికరాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయిల్ ఇంజన్లు, పైపులు, టార్పాలిన్ పట్టలు, తైవాన్ స్ప్రేయర్లు, గడ్డి కత్తిరించే యంత్రాలు, ట్రాక్టర్ మడకలు అందజేశామని వివరించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఆర్‌డీఓ రేణుక, డ్వామా పీడీ గంగాభవానీ, అడిషనల్ పీడీ ఉమావాణి, పీఓ తేజస్విని, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చల్లా లక్ష్మీ, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా, వాటర్ షెడ్ చైర్మన్లు హరికృష్ణారెడ్డి, చంద్రనాయుడు, మదనమోహన్‌రెడ్డి, నేతలు చెంచురెడ్డి, కోటా వెంకటరమణ, విజయభాస్కర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ సుష్మా పాల్గొన్నారు.

రేపటి 'స్పందన' రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం జిల్లాకు రానున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ సీఎం పర్యటన ఏర్పాట్లల్లో జిల్లా యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున స్పందన రద్దు చేసినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


శైలజ మృతదేహం

పెనుమూరు(కార్వేటినగరం) : మండలంలోని కలవ కుంట జలాశయంలో శనివారం ఓ వివాహిత దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. పాకాల మండలం ఇరగంపల్లె పంచాయతీ తలారిపల్లెకు చెందిన శైలజ(29)కు పూతలపట్టు మండలం గొడుగుచింత గ్రామానికి చెందిన నరేష్‌తో వివాహమైంది. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. శైలజ చిత్తూరు రిలయన్స్ మార్ట్‌లో పనిచేస్తోంది. అయితే కొన్నాళ్లుగా భార్య భర్తల నడుమ గొడవలు జరుగుతున్నాయి. శనివారం ఉదయం కూడా ఇరువురూ ఘర్షణ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన శైలజ బస్సు ఎక్కి ఎన్టీఆర్ జలాశయం (కలవకుంట జలాశయం) చేరుకుని అందులో దూకేసింది. దీనిపై సమాచారం అందుకునన పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించారు. పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా: ఒకరి మృతి


మృతి చెందిన ఆనంద్

గంగాధరనెల్లూరు : మండలంలోని చింతారెడ్డిపల్లె సమీపంలో ఎర్ర చేను వద్ద శనివారం ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. వింజం పంచాయతీ పాతూరు నత్తం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎన్.ఆనంద్(36) ట్రాక్టర్‌లో ఇటుకలు తరలిస్తుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఆనంద్‌పై ఇటుకలు పడడంతో అక్కడికక్కడే మరణించాడు. ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న కూలీలు కిందకు దూకేయడంతో సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ముఖ్యమంత్రి సభకు పకడ్బందీ ఏర్పాట్లు

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం జిల్లా పర్యటనకు రానున్నారు. జగనన్న విద్యాదీవెన పథకం కింద నగదు విడుదల చేయనున్నారు. ఈ మేరకు నగరిలో నిర్వహించనున్న బహిరంగ సభకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. శనివారం ఆయా పనులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ముఖ్యమంత్రి పర్యటనల సలహాదారు, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి పరిశీలించారు. మంత్రులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. హెలీప్యాడ్, బహిరంగ సభ ప్రాంగణం వద్ద శరవేగంగా ఏర్పాట్లు పూర్తి చేశారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్‌డీఓ సుజన తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పర్యటన


అధికారులకు సూచనలిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి, రోజా

ముఖ్యమంత్రి పర్యటన ప్రణాళికాబద్ధంగా సాగనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన పథకం కింద ఈ ఏడాది తొలి త్రైమాసికం నిధుల విడుదలకు ముఖ్యమంత్రి వస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 10.15 గంటలకు నగరిలోని కీళపట్టు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు సీఎం చేరుకుంటారని తెలిపారు. రోడ్డు మార్గంలో సభా వేదికకు చేరుకుంటారన్నారు. పలు అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. అనంతరం సభలో మాట్లాడతారని, కంప్యూటర్ బటన్ నొక్కి నిధులను లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తారని వివరించారు. మధ్యాహ్నం 1.25 గంటలకు నగరి డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరి వెళతారని తెలిపారు.

భద్రతపై సమీక్ష

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి సమీక్షించారు. మున్సిపల్ కార్యాలయంలో వారు అధికారులతో మాట్లాడుతూ పర్యటన ముగిసే వరకు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎలాంటి అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యఆరోగ్యశాఖ, అగ్నిమాపకశాఖ అధికారులు సైతం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.


చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,490
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76.00

2న మెగా జాబ్ మేళా


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్, డీఆర్‌డీఏ అధికారులు

కుప్పం: కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సెప్టెంబర్ 2 తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు. శనివారం ఈ మేరకు ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 99635 61744, 91609 12690, 93905 44632, 76720 96930లో సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు


మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

రొంపిచెర్ల: పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి స్వగ్రామంలో ఆ పార్టీ మాజీ ఎంపీటీసీ సభ్యురలు దుర్గం రాణెమ్మ పలువురు నాయకులతో కలసి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బొమ్మయ్యగారిపల్లె, పెద్దకురవపల్లె, ఉసువారిపల్లె గ్రామాలకు చెందిన నాగిశెట్టి నాగరాజా, కురుణాకర్, డి.సతీష్, సుజాత, విశాల, ఎన్.సరోజ, ఎస్.రియాజ్, మదర్‌సాబ్, ఖాతుంషా, ఎం.శ్రీరాములురెడ్డి ఉన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీలో పేదలపై దాడులు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సాగుతున్న అభివృద్ధిని చూసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వెల్లడించారు.

‘యునిసెఫ్ ఫినాలే’కి తడుకు విద్యార్థినులు


తయారు చేసిన పరికరంతో విద్యార్థినులు

పుత్తూరు రూరల్: పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి యునిసెఫ్ మెగా ఫినాలేకు పుత్తూరు మండలం తడుకు (ఆర్ఎస్) విద్యార్థినులు అర్హత సాధించారు. 2022లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా 2,326 పాఠశాలలు పోటీపడ్డాయి. అందులో కేవలం 28 పాఠశాలలను మాత్రమే అర్హత సాధించాయి. ఈ క్రమంలో తిరుపతి జిల్లా తడుకు పాఠశాలలో 9వ తరగతి విద్యార్థినులు హేమశ్రీ, గీతిక, భావన, గౌతమి, జాహ్నవి రూపొందించిన మినీ మల్టీపర్పస్ జెర్మ్స్ కిల్లర్ అనే పరికరం ప్రదర్శనకు ఎంపికైంది. ఈనెల 28 నుంచి విజయవాడలో మూడు రోజుల పాటు జరిగే యూనిసెఫ్ మెగా ఫినాలేలో వారు తమ ప్రదర్శన ఇవ్వనున్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు భానుప్రసాద్ మార్గదర్శకంలో ఈ సాధనాన్ని రూపొందించారు. దీని ద్వారా ఆస్పత్రుల్లోని ఐసీయూ, ఎమర్జెన్సీ వార్డుల్లో ఒక రోగి నుంచి మరో రోగికి అంటువ్యాధులు ప్రబలకుండా నియంత్రించవచ్చు. ఇళ్లలోని ఏసీ రూమ్స్‌లోనూ, టాయిలెట్లు, అంబులెన్స్‌లో ఈ సాధనాన్ని వినియోగించవచ్చు. మార్కెట్‌లో అందరికీ అందుబాటులో ఉండే ఐదు అంగుళాల పీవీసీ పైపు, ఎల్ఈడీ లైట్లు, గాజు పలకలు, అడాప్టర్, ఎగ్జాస్ట్ ఫ్యాన్, మస్కిటో బ్యాట్‌ను వినియోగించి ఈ పరికరాన్ని రూపొందించారు. ఇందుకు కేవలం రూ.1400 మాత్రమే ఖర్చు చేయడం విశేషం.

గ్రంథాలయ ఆవరణలో మృతదేహం

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా గ్రంథాలయ ఆవరణలో శనివారం ఓ వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడు అశోకపురానికి చెందిన యాసిన్‌బాషా (45)గా గుర్తించారు. మద్యం మత్తులో తిండి, నీరు లేక మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

హోంగార్డు ఆత్మహత్య

పుంగనూరు : పట్టణంలోని కట్టక్రిందపాళ్యెంలో నివాసిస్తున్న హోంగార్డు రమేష్‌రాజు(45) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. రమేష్‌రాజుకు భార్య, పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది యాబైరాళ్ల మొరవ వద్ద చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న కోసం పాదయాత్ర


పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బంగారుపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని ఆకాంక్షిస్తూ ఇచ్చాపురం వరకు పాదయాత్ర చేస్తున్నట్లు మార్కాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ జిలానీబాషా తెలిపారు. ప్రజా సంక్షేమ యాత్ర పేరుతో జిలానీబాషా చేపట్టిన పాదయాత్ర శనివారం జిల్లాలోని బంగారుపాళెం చేరుకుంది. వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సర్దార్, కో-ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు హిదాయత్, మైనారిటీ సెల్ మాజీ అధ్యక్షుడు షాకీర్, మాజీ సర్పంచ్ మస్తాన్‌తోపాటు పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిలానీబాషా మాట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి పాటు పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందుకే ప్రజలను చైతన్యవంతం చేసేందుకు మార్కాపురం నుంచి ఇచ్చాపురం వరకు 4,200 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు వెల్లడించారు.

ఏనుగు దాడిలో పంటల ధ్వంసం



పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లి పంచాయతీ పెనుగొలకల గ్రామం వద్ద ఒంటరి ఏనుగు విధ్వంసం సృష్టించింది. శుక్రవారం రాత్రి లింగమ్మ, రెడ్డివారి వెంకటప్ప, నంగివాళ్ల వెంకటప్ప అనే రైతులకు చెందిన టమాట, రాగి, వరి పంటలను తొక్కి నాశనం చేసింది. ఏనుగు దాడిలో సుమారు రూ.50 వేల పంట నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

10న అద్దాలమండపానికి కుంభాభిషేకం


మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న అద్దాలమండపానికి సెప్టెంబర్ 10వ తేదీన మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. శనివారం ఆలయ సమావేశ మందిరంలో ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు నరసింహులుశెట్టి, మారుతీశ్వరరావు, ఈఈ వెంకటనారాయణ, ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, హరిమాధవరెడ్డి పాల్గొన్నారు.